క్లుప్తంగా

మెగా వాలీబాల్ టోర్నమెంట్ పోటీలు

యడ్లపాడు: మండలంలోని ఉన్నవ గ్రామంలో మెగా వాలీబాల్ టోర్నమెంట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామ అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు మంగళవారం తెలిపారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా ఈ పోటీలు ఏర్పాటు చేసినట్లు వారు వెల్లడించారు. గ్రామ పెద్దలు, యువజన సంఘం సంయుక్త ఆధ్వర్యంలో జరిగే ఈ పోటీల్లో విజేతలైన జట్టుకు మొదటి బహుమతి రూ10,116, రెండో బహుమతి రూ.5,116, మూడో బహుమతి రూ.3,116 ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు సెల్‌నంబర్: 91605 95502, 76589 04387, 88852 86173 సంప్రదించాలన్నారు.

ఆకట్టుకున్న భరతనాట్య ప్రదర్శన



నాదెండ్ల: గణపవరం శ్రీ కోదండరామాలయంలో మంగళవారం మూడో రోజు చిన్నారుల భరతనాట్య ప్రదర్శన గ్రామస్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. రాత్రికి సోలో గోపిశెట్టి, గుడివాడ వారిచే ఆలిండియా బెస్ట్ డ్యాన్సర్ గోపిశెట్టి శిరి, విజయవాడ శ్రీశారదా నృత్య కళాపీఠం నాట్యాచార్యులు, నాట్య విశారద్ సంతోష్ ఆధ్వర్యంలో చిన్నారుల భరతనాట్య ప్రదర్శన, శ్రీకృష్ణ తత్వ నృత్య రూపకం భక్తులను ఆకట్టుకున్నాయి. ఈ ప్రదర్శనకు సహకరించిన హైదరాబాద్ వెజ్‌జోషి, అనురాధ దంపతులు, గణపవరం కోటేశ్వరరావు దంపతులను, డ్యాన్స్ మాస్టర్ సంతోష్‌ను ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు.

రంగస్థల నటుడు బెల్లంకొండ కోటయ్య మృతి



నాదెండ్ల: ప్రముఖ రంగస్థల నటుడు బెల్లంకొండ కోటయ్య (78) అనారోగ్యంతో తుది శ్వాస విడిచారు. ఆయన స్వగ్రామం సాతులూరు అయినప్పటికీ, కొన్నేళ్ల క్రితం గణపవరానికి వచ్చి స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నారు. నాలుగు దశాబ్దాలుగా రంగస్థల నటుడిగా పేరొందారు. 1947లో సాతులూరులో జన్మించిన ఆయన ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటూ కర్ణాటక, తమిళనాడులో చింతామణి నాటకంలో శ్రీహరి పాత్ర ధరించి నాలుగు వేలకు పైగా ప్రదర్శనలు ఇచ్చి ఎంతోమంది కళాప్రియులను ఆకట్టుకున్నారు. శ్రీహరి పాత్రను మొదట్లో చీరాల సుబ్బయ్య అవలీలగా పోషించే వారు. ఆయన మృతితో శ్రీహరిపాత్రను వేసిన కోటయ్య ఆ పాత్రకు వన్నె తెచ్చి కళాపోషకులను ఆకట్టుకున్నారు. ప్రముఖ రంగస్థల హాస్యనటుడు వీవీ స్వామి, అద్దంకి శ్రీనివాసరావు (సుబ్బిశెట్టి) పాత్రధారులకు సమకాలీకులుగా శ్రీహరి పాత్రకు వన్నె తెచ్చారు. గత కొంతకాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ గతనెల 16న చివరి ప్రదర్శన తమిళనాడు రాష్ట్రంలో చేసి ఈ నెల 3న ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. ఈయనకు భార్య, ఇరువురు కుమారులు ఉన్నారు. కోటయ్య మృతి పట్ల పలువురు కళాకారులు సంతాపం తెలిపారు.

రాడ్ బెండింగ్ మేస్త్రీ మృతి

నరసరావుపేట టౌన్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం పట్టణంలో చోటు చేసుకుంది. శివసంజీవయ్య కాలనీకు చెందిన యర్రగుంట్ల రామకోటేశ్వరరావు (46) రాడ్‌బెండింగ్ మేస్త్రీగా పనిచేస్తుంటాడు. మధ్యాహ్నం మల్లమ్మ సెంటర్ ఓవర్ బ్రిడ్జి పై నుంచి ద్విచక్ర వాహనంపై రామకోటేశ్వరరావు వెళ్తుండగా ఎదురుగా వచ్చిన అశోక్ లైలాండ్ గూడ్స్ వెహికల్ ఢీకొంది. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడ్డ క్షతగాత్రుడిని సమీపంలోని ప్రైవేటు వైద్యశాల్లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ విజయ్ చరణ్ తెలిపారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు.

రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించాలి

వినుకొండ: ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలను సాగుచేస్తూ అంతర పంటలు వేయడం ద్వారా రైతన్నలకు ఆదాయంతో పాటు భూమికి కావల్సిన సూక్ష్మపోషకాలు వృద్ధి చెంది భూమి ఆరోగ్యంగా ఉంటుందని పిట్టంబండ గ్రామకమిటీ అధ్యక్షులు మక్కెన కొండలు అన్నారు. మండలంలోని పిట్టంబండ గ్రామంలోని రామాలయం సెంటర్ వద్ద ప్రకృతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించి ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా 2025-26 సంవత్సరంలో ప్రతి ఒక్క రైతు భూమి, విస్తర్ణం, పంటలు, పాడి పశువుల వివరాలను సిబ్బందికి తెలియజేయాలన్నారు. జిల్లా ప్రకృతి వ్యవసాయ శిక్షకుడు సైదయ్య మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతో అనుబంధ శాఖలతో కలిసి ప్రకృతివ్యవసాయాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం రామాంజనేయులు, సీసీలు సుబ్బారావు, వీవోఏ అక్షయ, ఇన్‌చార్జిలు హనుమంతరావు, కోటేశ్వరరావు, అరుణ, రేణుకా, గోవిందు, రైతులు పాల్గొన్నారు.

వరుణా... ఎంత పనిచేశావ్!



తడిసిన మొక్కజొన్నను ఆరబెడుతున్న రైతులు

- మొక్కజొన్న రైతును నష్టపరిచిన అకాల వర్షం
- కోతకు వచ్చిన పంట నేలకొరిగింది!

నరసరావుపేట రూరల్: అకాల వర్షం మొక్కజొన్న రైతులకు తీవ్ర నష్టాలను మిగిల్చింది. మండలంలో సోమవారం రాత్రి ఈదురుగాలులతో కూడిన జల్లులు కురిశాయి. దొండపాడులో భారీ వర్షం కారణంగా కోతకు వచ్చిన మొక్కజొన్న పంట నెల కొరిగింది. కోత కోసిన మొక్కజొన్న పంట పెద్ద ఎత్తున కల్లాల్లో ఉంది. ఆకాశం ఒక్కసారిగా మేఘావృతం కావడంతో రైతులు ఉరుకులు పరుగులు పెట్టారు. కల్లాల్లోని మొక్కజొన్న వర్షానికి తడిచిపోకుండా పట్టాలు కప్పేందుకు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. మంగళవారం ఉదయం పట్టలు మీద నిలిచిన నీటిని బయటకు వెల్లబెట్టారు. అనంతరం మొక్కజొన్న పంటను ఆరబెట్టారు. మరోవైపు కోతకు వచ్చిన మొక్కజొన్న నెలకొరగడంతో రైతులపై అదనపు భారం పడనుంది. ఇప్పటి వరకు మొక్కజొన్న పంటను మిషన్‌లతో నిర్వహిస్తున్నారు. నెలకొరిగిన పంట కొత మిషన్‌తో కుదరదు. దీంతో కూలీలతో కోత నిర్వహించాల్సి ఉంటుంది. ఇది రైతులకు అదనపు భారం కానుంది. దొండపాడులోని వర్షానికి తడిచిన మొక్కజొన్న కల్లాలను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మంగళవారం పరిశీలించారు. తడిచిన మొక్కజొన్న మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



దొండపాడులో కల్లాల్లో మొక్కజొన్న పంట

అక్రమం.. అనధికారికం!!



పల్నాడురోడ్డు అన్నాక్యాంటీన్ వద్ద ఆక్రమణలను తొలగిస్తున్న మున్సిపల్‌సిబ్బంది



సాయినగర్‌లో అనధికారిక లేఅవుట్‌లో వేసిన హద్దురాళ్లను తొలగిస్తున్న సిబ్బంది

- లే అవుట్లపై మున్సిపల్ కన్నెర్ర
- పలుచోట్ల ఆక్రమణల తొలగింపు
- అనధికారిక లే అవుట్ల హద్దురాళ్లు తొలగింపు

నరసరావుపేట: పురపాలక సంఘం పరిధిలోని అనధికార లేఅవుట్లు, ఆక్రమణలపై అధికారులు కన్నెర్ర చేశారు. మంగళవారం పల్నాడు రోడ్డు అన్న క్యాంటీన్ వద్ద రోడ్డు ఆక్రమణలు, పెద్ద చెరువులో బీసీ కమ్యూనిటీ హాల్ ఎదురు కాలువ ఆక్రమించి నిర్మించిన మెట్లను తొలగించి కాలువలో మురుగు వెళ్లే విధంగా చేశారు. అలాగే సత్తెనపల్లిరోడ్డు సాయినగర్ సమీపంలో అనధికారికంగా వేసిన లేఔట్‌లోని ప్లాట్ బౌండరీ రాళ్లను తొలగించారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు మాట్లాడుతూ పట్టణంలో ఎటువంటి రోడ్లు, మురుగు కాలువలను ఆక్రమణ చేస్తూ నిర్మించిన కట్టడాలను ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా వెంటనే తొలగించబడుతుందని హెచ్చరించారు. అనధికార లేఅవుట్లలో ప్లాట్లు కొని నష్టపోవద్దుని కోరారు. ప్లాట్ కొనేముందు అప్రూవల్ ఉందో లేదో పరిశీలించిన తర్వాతనే కొనుగోలు చేయాలని ప్రజలకు సూచించారు.

ట్రక్ డ్రైవర్ల శిక్షణ కేంద్రం పరిశీలన

- పరిశీలించిన మోటారు వాహన ఇన్‌స్పెక్టర్లు
- రోడ్డు సేఫ్టీ ఆధ్వర్యంలో ఆర్టీవో కార్యాలయం ప్రక్కనే ఏర్పాటు



సంస్థ పరిశీలనకు వచ్చిన అధికారులతో దుర్గాపద్మజ

నరసరావుపేట: స్వయం ఉపాధి, రోడ్డు ప్రమాదాల నివారణ అనే అంశాన్ని దృష్టిలో పెట్టుకొని రోడ్డు సేఫ్టీ ఎన్జీవో సంస్థ ఆధ్వర్యంలో కోటప్పకొండ రోడ్డులోని రవాణా శాఖ ఆర్టీవో కార్యాలయం పక్కనే రోడ్డు సేఫ్టీ ఎడ్యుకేషన్ ట్రైనింగ్, రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ట్రక్ డ్రైవర్ల శిక్షణ కేంద్రాన్ని మంగళవారం రవాణాశాఖ అధికారులు పరిశీలించినట్లు ఆ శిక్షణ సంస్థ మేనేజింగ్ పార్టనర్ కనకదుర్గ పద్మజ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె వివరాలు తెలియచేస్తూ చదువు లేని వారికి ట్రాన్స్‌పోర్టు వాహనాల డ్రైవింగ్ శిక్షణ లైసెన్స్ ఇప్పించడం, వారికి స్వయం ఉపాధి కల్పించాలనే దృక్పథంతో ఈ శిక్షణ సంస్థను ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ యోజన కింద ఎంఎస్ఎంఈ యూనిట్‌గా ఏర్పాటు చేశామన్నారు. దీనికి అనుమతులు కోసం సంబంధిత ఫీజును చెల్లించి స్థానిక జిల్లా రవాణాశాఖ అధికారికి అర్జీ చేసుకున్నామన్నారు.

ఈ మేరకు జిల్లా ఆర్టీవో ఇచ్చిన ఆదేశాలతో నరసరావుపేట, పిడుగురాళ్ల, చిలకలూరిపేటలకు చెందిన ముగ్గురు మోటారు వెహికల్ ఇనస్పెక్టర్లు తమ సభ్యులతో తనిఖీ కమిటీగా వచ్చి అనుమతులు పరిశీలించారన్నారు. సెంట్రల్ మోటార్ వాహనం చట్టం ప్రకారమే అన్ని రూల్స్‌ను పాటిస్తూ ముఖ్యంగా అడ్మిషన్ కార్యాలయం, తరగతి గదులు డిజిటల్ క్లాస్ రూం, హైడ్రాలిక్‌తో కూడిన ట్రాన్స్‌పోర్టు వాహనంతో శిక్షణ ఇవ్వడానికి అనుభవం కలిగిన వారిని నియమించడం జరిగిందన్నారు. ఉన్నత విద్య కలిగిన బీటెక్ మెకానికల్ కోర్సు చేసిన వారిని నియమించటం జరిగిందన్నారు. ట్రక్ డ్రైవింగ్ శిక్షణ సంస్థ ద్వారా అన్ని ప్రమాణాలు పాటిస్తూ రోడ్డు ప్రమాదాల రహిత ట్రాన్స్‌పోర్టు డ్రైవర్లను తయారు చేస్తామని చెప్పారు.

రేపు డయల్ యువర్ డీఎం కార్యక్రమం

చిలకలూరిపేటటౌన్: ఏపీఎస్ఆర్టీసీ చిలకలూరిపేట డిపో ఆధ్వర్యంలో గురువారం 'డయల్ యువర్ డీఎం' ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ ఎస్ రాంబాబు తెలిపారు. నియోజకవర్గం పరిధిలోని నాదెండ్ల, ఎడ్లపాడు, చిలకలూరిపేట మండలాల ప్రజలు 'డయల్ యువర్ డీఎం ప్రోగ్రాంను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఆయా మండలాల్లోని గ్రామీణ ప్రజలు ఆర్టీసీ బస్సులు గురించి సమస్యలు, సూచనలు, సలహాలు ఇవ్వవలసిందిగా ఆయన కోరారు. ఫోన్ చేయవలసిన సమయం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు ఫోన్ చేయవలసిన నంబర్ 995922 5427

దారి వివాదంలో వరి పంట ధ్వంసం

శావల్యాపురం: పొలం దారి వివాదంలో వరి పంటను ట్రాక్టరుతో తొక్కించిన సంఘటన మంగళవారం మండలంలోని కృష్ణాపురం గ్రామంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం పొలం దారి విషయంలో బోడపాటి యోగయ్య, పోట్లూరు గ్రామానికి చెందిన గోనుగుంట్ల వెంకట్రావుల మధ్య వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో తన నాలుగు ఎకరాల వరి పంటను వెంకట్రావు ట్రాక్టరుతో తొక్కించి పాడు చేసినట్లు యోగయ్య పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేశాడు. విచారణలో భాగంగా రూరల్ సీఐ ప్రభాకర్ శావల్యాపురం ఎస్ఐ లోకేశ్వరరావుతో కలసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఇరువురినీ పిలిపించి విచారించామని బాధ్యులని తేలితే చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు.

ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి

సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు

రొంపిచర్ల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలు ఉద్యమించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు పిలుపునిచ్చారు. సీపీఐ ఆధ్వర్యంలో భగత్ సింగ్ వర్ధంతి మార్చి 23 నుంచి అంబేద్కర్ జయంతి ఏప్రిల్ 14 వరకు జరుగుతున్న సీపీఐ రాజకీయ ప్రచార జాతా 17వ రోజైన మంగళవారం మండలంలో విప్పర్లపల్లి గ్రామంలో నిర్వహించారు. ఈ ప్రచార జాతా కార్యక్రమంలో పాల్గొన్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు గ్రామంలో ర్యాలీ నిర్వహించి సీపీఐ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు రాయితీలు కల్పిస్తూ, పేద, సామాన్య, మధ్య తరగతి ప్రజలపై పెను భారాలు మోపుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. సీపీఐ ఏరియా కార్యదర్శి చక్రవరం సత్యనారాయణ రాజు మాట్లాడుతూ సీపీఐ రాజకీయ ప్రచార కార్యక్రమాలకు, ప్రజా ఆందోళన కార్యక్రమాలకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు ఉప్పలపాటి రంగయ్య, ప్రజానాట్యమండలి కళాకారులు షేక్ చిన్న జాన్ సైదా, సీపీఐ నాయకులు జమ్మలమూడి వెంకటేశ్వర్లు, కృపారావు, గణేష్, ప్రసాద్, రాజు, ఏసోబు, జాన్, దేవరాజు, అశోక్, రమేష్ పాల్గొన్నారు.

చక్కగా చదివి.. ఉన్నతంగా ఎదగండి

విద్యాదాత నడికట్టు రామిరెడ్డి



ఐదో తరగతి విద్యార్థులతో రామిరెడ్డి, ఉపాధ్యాయుల

నాదెండ్ల: విద్యకు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలతో పాటూ దాతలు అందిస్తున్న సహాయాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత చదువుల్లో రాణించాలని విద్యాదాత, గోల్కొండ గ్రూపు సంస్థల ఛైర్మన్ నడికట్టు రామిరెడ్డి చెప్పారు. చిరుమామిళ్ళ కాసు రాఘవమ్మ, బ్రహ్మానందరెడ్డి ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఐదవ తరగతి విద్యార్థులకు ఫేర్‌వెల్ నిర్వహించారు. హెచ్ఎం కరిముల్లా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రామిరెడ్డి మాట్లాడుతూ ఆర్థిక సమస్యల కారణంగా ఏ విద్యార్థి చదువుకు దూరం కాకూడదన్నారు. విద్యార్థులు చక్కగా చదువుకుని జీవితంలో ఉన్నత విద్యావంతులుగా ఎదగాలన్నారు. ప్రస్తుతం ఈ పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థి ఇస్రోలో శాస్త్రవేత్తగా పనిచేస్తుండటం గర్వకారణమన్నారు. మరెంతో మంది విద్యార్థులు ప్రముఖ కార్పొరేట్ కంపెనీల్లో ఉన్నత హోదాల్లో ఉన్నారని, ఇలాంటి వారిని స్ఫూర్తిగా తీసుకుని నేటి విద్యార్థులు ఎదగాలన్నారు. హెచ్ఎం మాట్లాడుతూ ఈ పాఠశాలలో ప్రస్తుతం 160 మంది విద్యార్థులు, పది మంది ఉపాధ్యాయులతో మండలంలోనే అతిపెద్ద ప్రాథమిక పాఠశాలగా ఉందన్నారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు, సువిశాల ఆటస్థలం అందుబాటులో ఉందన్నారు. దాత నడికట్టు రామిరెడ్డి సహకారం మరువలేనిదన్నారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు రామిరెడ్డిని పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. విద్యార్థులకు విద్యా సామగ్రి అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కాట్రు శ్రీనివాసరావు, సుబ్రహ్మణ్యం, కె.శ్రీదేవి, కె.అన్నమ్మ, ఎస్.శ్రీదేవి, సీహెచ్ మూర్తి, పి.మేరిజ్యోత్స్న, నాగవర్ధిని, పీఎంసీ ఛైర్మన్ పెదబాబు పాల్గొన్నారు.

సాగర్ కాలువల్లో పూడిక తొలగింపు పనులు

పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

యడ్లపాడు: రైతుల ప్రయోజనాల్లో భాగంగా గోదావరి జలాలతో సీఎం చంద్రబాబు రాష్ట్రాన్ని సస్యశ్యామలం అవుతుందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. యడ్లపాడు మండలంలో మంగళవారం సాగర్ కెనాల్‌లోని అనుబంధ మేజర్లలో జంగిల్ క్లీయరెన్స్, పూడిక పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన రైతులతో మాట్లాడారు. నియోజకవర్గంలోని ఎన్నార్ మేజర్, పెదనందిపాడు మేజర్ కెనాల్, తుర్లపాడు మేజర్ కాలువల్లోని 24 ప్రదేశాల్లో రూ.కోటి అంచనా వ్యయంతో పనులకు శ్రీకారం చుట్టామన్నారు. అధికారులు మొక్కుబడిగా నిర్వహించకుండా రైతుల అభిప్రాయాల్ని తెలుసుకుంటూ బాధ్యతగా దగ్గరుండి పర్యవేక్షించాలని సూచించారు. ఆయా పనుల్ని నీటి సంఘాల అధ్యక్షులు నిత్యం పరిశీలించాలన్నారు. ఆయన వెంట డీఈ శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు కందిమళ్ళ రఘు రామారావు, సుబ్బారావు, తోకల రాజేష్, కుర్రా రత్తయ్య, పోపూరి వెంకట రత్తయ్య, రాఘవయ్య, మద్దూరి వీరారెడ్డి, శ్రీనివాసరెడ్డి, కల్లూరి శ్రీనివాసరావు, డి.ఈ శ్రీనివాసరావు అధికారులు తదితరులున్నారు

బెల్టుషాపులపై చర్యలు చేపట్టాలి

- ఎక్సైజ్ కార్యాలయం వద్ద నిరసన
- వినతిపత్రం అందజేసిన ప్రజాసంఘాలు



నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

నరసరావుపేట: బెల్ట్ షాపులు నిర్వహించే లైసెన్స్ షాపు యజమానులపై చర్య తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం పల్నాడు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసి అధికారులకు వినతిపత్రం అందజేశారు. దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం (పీడీఎం) రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా బెల్ట్ షాపులు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయన్నారు. ఒక్క బొల్లాపల్లి మండలంలోనే సుమారు 300 వరకు బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్నారన్నారు. రేమిడిచర్ల, వెల్లటూరు, బొల్లాపల్లిలో లైసెన్స్ తీసుకున్న షాపుల యజమానులే టాటా మ్యాజిక్ వాహనాల ద్వారా తండాలు, గ్రామాలకు మందుని సరఫరా చేస్తున్నారని చెప్పారు. ఒకవైపు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బెల్టుషాపులు అదుపు చేయాలంటే లైసెన్స్ షాపుల యజమానులపై చర్యలు తీసుకోవాలని ప్రకటించినా ఎక్సైజ్ శాఖ ఏమి చేయకుండా వారు నియమించిన వ్యక్తుల్ని అరెస్ట్ చేసి చేతులు దులుపుకుంటున్నారన్నారు. అధికారులు, రాజకీయ నాయకులు బెల్ట్‌షాపులు అరికట్టడంలో పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. పీడీఎం సీనియర్ నాయకులు నల్లపాటి రామారావు, జిల్లా అధ్యక్షులు షేక్ మస్తాన్‌వలి, ఆర్టీఐ కార్యకర్త వసంతరావు, బీసీ నాయకులు బాదుగున్నల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సత్తాచాటిన కేబీఆర్ విద్యార్థులు

రాష్ట్రస్థాయి రెజ్లింగ్‌లో పతకాలు



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపల్ నాగిరెడ్డి

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్రస్థాయి రెజ్లింగ్ (కుస్తీ) పోటీల్లో కాసు బ్రహ్మానందరెడ్డి కళాశాల విద్యార్థులు పలు విభాగాలలో బంగారు పతకాలు సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికై నట్టు కళాశాల ప్రిన్సిపల్ సి.హెచ్.వి.నాగిరెడ్డి, వ్యాయామ అధ్యాపకుడు ఎం.వినీల్ మంగళవారం తెలిపారు. అమెచ్యూర్ (అండర్-20) రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 4 నుంచి 6వ తేదీ వరకు రాజమండ్రిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో తమ విద్యార్థులు ఎం.మహేష్ 72 కేజీల గ్రీకో-రోమన్ విభాగంలో బంగారు పతకం, ఎం.అఖిల్ 97 కేజీల విభాగంలో బంగారు పతకం, టి.సన్నీ 63 కేజీలు, కె.ప్రభాకర్ 82 కేజీల విభాగాలలో కాంస్య పతకాలు సాధించారని వివరించారు. కాగా, వీరిలో ఎం.మహేష్ ఈనెల 20 నుంచి 23వ తేదీ వరకు జరగనున్న జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించినట్టు తెలిపారు. విద్యార్థులను కళాశాల కార్యదర్శి, గురజాల మాజీ శాసనసభ్యుడు కాసు మహేష్‌రెడ్డి, కె.వి.పురుషోత్తమరావు, ప్రిన్సిపల్ నాగిరెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎ.వెంకటశివ తదితరులు అభినందించారు.

అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలి

రాజ్యాంగ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సీహెచ్ సుబ్బారావు



మాట్లాడుతున్న సీహెచ్ సుబ్బారావు

నాదెండ్ల: జాతీయ ఉన్నత విద్యాసంస్థలైన ఐఐటీ, ఎన్ఐటీ, ఐఐఎంల్లో అధ్యాపకుల ఖాళీలను కేంద్రం ప్రభుత్వం తక్షణమే భర్తీ చేయాలని రాజ్యాంగ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సీహెచ్ సుబ్బారావు చెప్పారు. సాతులూరులో ఉద్యోగులతో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. విద్యార్థుల నిష్పత్తికి తగ్గట్లుగా నియామకాలు చేపట్టాలన్నారు. రాష్ట్రంలో ఉన్న కేంద్రీయ విద్యాలయాల్లో బోధన, బోధనేతర పోస్టుల భర్తీకి కేంద్రం వెంటనే స్పందించి ఖాళీలను పూర్తి చేయాలన్నారు. సెంట్రల్ యూనివర్సిటీలో రిజర్వు కేటగిరీ పోస్టులు ఓబీసీ 1521, ఎస్సీ 728, ఎస్టీ 432 పోస్టులు భర్తీ చేయాలన్నారు. యూనివర్సిటీలో రిజర్వు కేటగిరీ, నాన్ టీచింగ్ పోస్టులు ఓబీసీ 1983, ఎస్సీ 1001, ఎస్టీ 1441 పోస్టులు భర్తీ చేయాలన్నారు. పాఠశాలల్లో, కళాశాలల్లో విద్యార్థులకు తగ్గట్లు ఉపాధ్యాయులు ఉన్నపుడే పరిపూర్ణ విద్య అందుతుందన్నారు. కార్యక్రమంలో ఎం.ప్రసన్నకుమార్, కె. విజయకుమార్, జి.అనిల్‌కుమార్ ఉన్నారు.

మోసం చేసిన ఉద్యోగిపై చర్యలు తీసుకోండి

అధికారులకు బాధితుడు, ప్రజాసంఘాలు వినతి



కార్యాలయం ఎదుట బాధితుడితో నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

నరసరావుపేట: తనవద్ద పల్నాడు జిల్లా పరిశ్రమల శాఖ ఆఫీసులో ఐపీవోగా ఉద్యోగం చేస్తున్న వ్యక్తి ప్రింటింగ్ ప్రెస్ వ్యాపారం పెట్టుకోవడానికి రూ.10 లక్షలు రుణం ఇప్పిస్తానని నమ్మించి తన వద్ద రూ.40 వేలు తీసుకొని మోసం చేశాడని సత్తెనపల్లికి చెందిన బాధితుడు గాదం శ్రీనివాసరావు ఆరోపించారు. మంగళవారం ప్రజాసంఘాల నాయకులతో కలిసి ప్రకాష్‌నగర్‌లోని కార్యాలయంకు వచ్చి ఉద్యోగి చేసిన మోసంపై ఉన్నతాధికారులకు మరోసారి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలోనే తన డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరుతూ వినతి పత్రం ఇవ్వటం జరిగిందని, ఇప్పటి వరకు స్పందన లేకపోవటంతో మరోసారి రావటం జరిగిందన్నారు. తనవద్ద డబ్బులు తీసుకుని తీరా రుణం ఇప్పించకుండా మోసం చేశాడని, ఇదేమని అడిగితే నీ దిక్కున్న చోట చెప్పుకోపోమని దురుసుగా ప్రవర్తిస్తున్నాడని అన్నారు. ఉద్యోగిపై చర్యలు తీసుకుని తన డబ్బులు తనకు ఇప్పించి న్యాయం చేయాలని కోరారు. దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం (పీడీఎం) రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు, జిల్లా అధ్యక్షులు షేక్ మస్తాన్‌వలి, కార్యదర్శి జి.రామకృష్ణ, గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు వి.కోటనాయక్, బీసీ సంఘం నాయకులు బాదుగునల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యామిత్ర కిట్స్ భద్రత గదుల పరిశీలన



రొంపిచర్ల: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ లోని తరగతి గదులను రాష్ట్ర పరిశీలకురా లు పి. వనజ పరిశీలించారు. సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిట్స్‌ను భద్రపరిచేందుకు అవసరమైన స్టాక్ పాయింట్లను పాఠశాలలో ఏర్పాటు చేయనున్నారు. విద్యార్థులకు అందించే షూస్, బెల్ట్‌లు, యూనిఫాంలు, టెస్ట్‌బుక్స్, నోట్ పుస్తకాలు, డిక్షనరీలు, స్కూల్ బ్యాగ్స్‌ను ఈ గదుల్లో భద్రపరచనున్నారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు ప్రారంభమయ్యే వరకు స్టాక్ పాయింట్లో సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిట్స్ నిల్వ ఉంచుతారు. పాఠశాలల పునః ప్రారంభంలో ఈ కిట్స్‌ను ఆయా పాఠశాలలకు తరలించి విద్యార్థులకు అందజేస్తారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా ఏఎస్‌వో పి. పద్మారావు, ఎంఈవో డి. బ్రహ్మేశ్వరరావు అధికారులు పాల్గొన్నారు.

నలుగురు వ్యక్తులపై అట్రాసిటీ కేసు నమోదు

నాదెండ్ల: తిరునాళ్ళ చూసుకుని ఇంటికి వెళ్తున్న వ్యక్తిపై నలుగురు వ్యక్తులు దాడి చేయటమే కాక కులం పేరుతో దూషించినట్లు పోలీసులు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఎస్సై జి. పుల్లారావు తెలిపిన వివరాల మేరకు నరసరావుపేట రూరల్ మండలం కేసానుపల్లికి చెందిన చెల్లి రాముడు శ్రీరామనవమి సందర్భంగా ఎండుగుంపాలెంలో అక్కాయకుంట ఆంజనేయ స్వామి తిరునాళ్లకు వెళ్ళి తిరిగి బుక్కాపురం మీదుగా కేసానుపల్లి వెళ్తున్నాడు. ఈ క్రమంలో అదేగ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు రాముడిపై కులం పేరుతో దూషిస్తూ దాడి చేశారు. దీనిపై రాముడు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.